గోదాముల నిర్మాణం..అంతంతమాత్రం

- పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్లు
- సహకార సంఘాలపై వడ్డీ భారం
- రైతుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం


విస్సన్నపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన మినీ గోదాము నిర్మాణం

తిరువూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామీణ రైతులకు అందుబాటులో ఉండే విధంగా చేపట్టిన మినీ గోదాముల నిర్మాణ పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయి. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా నిర్మించి రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పర్యవేక్షణలో ఉంచాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. తిరువూరు డివిజన్‌లో 36 సహకార సంఘాల పరిధిలో 50కి పైగా మినీ గోదాములను లక్ష్యంగా నిర్ణయించగా, 13 గోదాములకు స్థల సేకరణ పూర్తయింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వీటి నిర్మాణ పనులకు సహకార సంఘాల నుంచి నిధులు కేటాయించగా ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పనులు జరగలేదు. అనంతరం ఐదు గోదాముల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మిగిలినవి గోడలు లేక, పై కప్పు లేక అసంపూర్తిగా మిగిలిపోయాయి.

పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్లు

తిరువూరు డివిజన్‌లో మినీ గోదాముల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో సహకార సంఘాలకు రుణభారం అధికమవుతోంది. గోదాములు పూర్తయి రైతులు వీటిని అద్దెకు తీసుకుని వినియోగించుకుంటే ప్రయోజనకరంగా ఉండేది. సహకార సంఘాలకు ఆదాయం కూడా సమకూరేది. సకాలంలో గోదాముల నిర్మాణానికి మంజూరు చేసిన రుణం తిరిగి చెల్లిస్తే పీఏసీఎస్‌లకు నాలుగు శాతం వడ్డీలో సగం నాబార్డు నుంచి రాయితీ కూడా వచ్చే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

పట్టించుకోని అధికారులు

సహకార సంఘాల నిధులతో చేపట్టిన మినీ గోదాములు పూర్తి కాకపోయినా వాటి గురించి సహకార శాఖాధికారులు ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తిరువూరు, గంపలగూడెం మండలాల్లో సన్న, చిన్నకారు రైతుల ధాన్యం నిల్వ చేసే సదుపాయం లేక తడిసి పాడైపోగా, పూర్తయిన గోదాములను సైతం కాంట్రాక్టరు ఆయా పీఏసీఎస్‌లకు స్వాధీన పరచకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరలేదు. తిరువూరు మండలం లక్ష్మీపురం పీఏసీఎస్‌కు అనుబంధంగా నిర్మించిన గోదామును కార్యాలయ అవసరాలకు వినియోగిస్తుండగా, టేకులపల్లి, మల్లేల సొసైటీల పరిధిలో పూర్తయిన గోదాములకు మాత్రం తాళాలు వేసి ఉంచారు. ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు, చీమలపాడు, కోడూరు, గంపలగూడెం మండలం నెమలి, కనుమూరు, గంపలగూడెం గ్రామాల్లో, విస్సన్నపేటలో గోదాముల నిర్మాణం పూర్తిచేయడం లేదు.

రైతులంటే చిన్నచూపు



మినీ గోదాములు నిర్మించి గ్రామాల్లోని పేద రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అధికారులు నీరుగార్చారు. పీఏసీఎస్‌లలో సభ్యులైన రైతులకు ఉపయోగపడే గోదాముల నిర్మాణం ఎందుకు నిలిపివేశారో తెలియడం లేదు. రైతులంటే చిన్నచూపు తగదు.

– శ్రీనివాసరావు, అక్కపాలెం, తిరువూరు మండలం

గోదాముల నిర్మాణం పూర్తిచేయాలి



సన్న, చిన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉండే విధంగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాముల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రతి సీజన్లో రైతులు తాము పండించిన ధాన్యం దాచుకునే సదుపాయం లేక తక్కువ ధరకు విక్రయించడం లేదా అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యంతో నష్టపోవడం పరిపాటైంది. ఇకనైనా మినీ గోదాములను అందుబాటులోకి తీసుకురావాలి.

– పరసా నెహ్రూ, తిరువూరు


క్లుప్తంగా

అమ్మవార్లకు శ్రావణమాస పూజలు



ఆగిరిపల్లి: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండలంలోని అమ్మవార్ల ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. స్థానిక వరాహ పుష్కరిణి వద్ద ఉన్న కనకదుర్గమ్మ వారి ఆలయంలో అమ్మవారిని కదంబ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. ముక్తేశ్వర స్వామి ఆలయంలో బాలా త్రిపుర సుందరి దేవికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. దుగ్గిరాల బాల రావమ్మ తల్లి ఆలయంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేణుగోపాలుడికి శాకంబరి అలంకరణ



తిరువూరు: గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి, అమ్మవారికి వివిధ రకాల ఫలాలు, కాయగూరలతో శాకంబరి అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలు, పండ్లతో సర్వాంగసుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య పర్యవేక్షించారు.

ఉద్యాన పంటల సాగు లక్ష్యాలు పూర్తి చేయాలి

ఆర్డీఓ మాధురి



విస్సన్నపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగుకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీఓ మాధురి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు వలన కలిగే ప్రయోజనాలను రైతులకు సిబ్బంది వివరించాలన్నారు. రైతులు ముందుకు వచ్చి ఉద్యాన పంటల సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, హెచ్ఓ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): మొక్కలు నాటి వాటిని సంరక్షించడంపై కేతనకొండ ఎంపీపీ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ ఇర్ఫాన్ పాషా విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. గతంలో నాటిన మొక్కల సంరక్షణ, పెరుగుదల స్థితిని ప్రతి రెండు నెలలకోసారి నమోదు చేసేందుకు గ్రీన్ పాస్‌పోర్టులు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని సూచించారు.

కళాశాలకు ప్రింటర్ బహూకరణ



తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థి, ప్రస్తుతం సీజీఎస్టీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డీవీకే కిశోర్ కళాశాలకు ఇన్వర్టర్, ప్రింటర్ బహూకరించారు. కిశోర్ సతీమణి, ఐఎఫ్ఎస్ అధికారి క్షితిజ ద్వారా రూ.46 వేల విలువైన ప్రింటర్‌ను, ఇన్వర్టరును ప్రిన్సిపాల్ జీవీఎస్‌జీ లక్ష్మికి అందజేశారు. అధ్యాపకులు మురళి, గోపిశెట్టి నరసింహారావు, అజయ్, పూర్వ విద్యార్థులు కొత్తగుండ్ల నాగేంద్రరావు, ఎంవీఆర్ నరసింహారావు, ఈఎల్‌సీ కేశవరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

తిరువూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తిరువూరు పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ కె. మనోజ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇళ్లల్లో వాడిన చెత్తను ఖాళీ ప్రదేశాల్లో పారవేయవద్దని, ఇంటింటికీ వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఖాళీ స్థలాల యజమానులు ఆ స్థలాల్లోని చెట్లను నరికించి నీరు నిల్వ ఉండకుండా మెరక చేయించుకోవాలన్నారు. లేకుంటే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరు జిల్లా అధికారులను శుక్రవారం ఆదేశించారు. వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితిపై అధికారులను మంత్రి పార్థసారథి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి అధికారులకు పలు సూచనలు చేశారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో మైలవరం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాసన్ కంటి ఆస్పత్రి వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలు సహించం

ఏలూరు డీఎస్‌ఓ బాబూ విలియమ్స్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ బాబూ విలియమ్స్

నూజివీడు: రేషన్ సరుకుల పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్‌ను అమలు చేస్తామని ఏలూరు డీఎస్‌ఓ ఇ.బాబూ విలియమ్స్ హెచ్చరించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని రేషన్‌షాపు డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు సమయపాలన పాటించి ఒకటి నుంచి 15 తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలను తెరిచి నిత్యావసరాలను పంపిణీ చేయాలన్నారు. 65 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులకు రేషన్ డీలర్లు ప్రతి నెలా 26 నుంచి 30 వరకు వారి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను అందజేయాలని చెప్పారు. సమావేశంలో నూజివీడు తహసీల్దార్ గుగులోతు భద్రు, సివిల్ సప్లయీస్ డీటీ జి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో న్యాయవాదుల నిరసన


మైలవరం కోర్టు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మైలవరం: న్యాయవాదుల పరిరక్షణకు చట్టాలు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు డిమాండ్ చేశారు. మైలవరం కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల అసోసియేషన్ హాల్‌లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై రోజురోజుకు పెరుగుతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, కిడ్నాపులు, హత్యలు, హత్యా యత్నాలతో వృత్తి రీత్యా న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఏపీ న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. మైలవరంలో నూతన కోర్టు ప్రాంగణాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసి ప్రారంభించాలని, రాష్ట్ర వ్యాప్తంగా న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయాలని, న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, కోర్టు కాంప్లెక్స్ వద్ద న్యాయవాదులకు కాలనీ నిర్మాణం చేపట్టాలని కోరారు. మైలవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పీవీ శేషగిరిరావు, మాదు ఆంజనేయులు, ముల్లంగి రవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, జి. శ్రీనివాసరావు, ఐఏఎల్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన చికిత్స అందించాలి

డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్


వార్డులను సందర్శిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్

నూజివీడు: ఏరియా ఆస్పత్రికి వచ్చే పేద వర్గాలకు చెందిన రోగులకు మెరుగైన వైద్య సాయం అందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని విభాగాలను, ఓపీ రికార్డులను పరిశీలించి వైద్యులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. ప్రభుత్వాస్పత్రి పైన నూతనంగా నిర్మిస్తున్న ప్రత్యేక రూంలను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయన వెంట ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి ఉన్నారు.

పందుల సంచారంతో ఇబ్బందులు


ఆగిరిపల్లి ప్రధాన రహదారిలో సంచరిస్తున్న పందులు

ఆగిరిపల్లి: గ్రామంలో పందుల సంచారం పెరిగిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టపగలే ప్రధాన రహదారుల్లో పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల ప్రభావం ఉండే వర్షాకాలంలో పందుల సంచారం భయాందోళనకు గురిచేస్తోందని స్థానికులు వాపోతున్నారు. టిఫిన్, బిర్యానీ హోటల్స్ నిర్వహించే వారు మిగిలిన ఆహార పదార్థాలను రోడ్లపై పడవేయడం వల్లనే వాటి కోసం పందులు సంచరిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి నివాసిత ప్రాంతాల్లో పందులు సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పకడ్బందీగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఎంజీరోడ్డులోని ఈట్ స్ట్రీట్, వేముల శ్యామలాదేవి రోడ్డు, కర్నాటి రామ్మోహన్ స్కూల్ వీధి, విశాలాంధ్ర రోడ్, బీఆర్టీఎస్ రోడ్, సీకే రెడ్డి రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. శాతవాహన కాలేజీలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లను ఒకటి కర్నాటి రామ్మోహనరావు స్కూల్లో, మూడింటిని ఎస్ఆర్ఆర్ కాలేజ్‌లో ఏర్పాటు చేసేందుకు ఏఈఆర్వోలు, సెంట్రల్ తహసీల్దార్ ప్రతిపాదించగా ఈ సందర్భంగా వాటిని ఆయన పరిశీలించారు. ఈట్ స్ట్రీట్‌లో నిరంతరం డీసిల్టింగ్ పనులను చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం ఉండకూడదన్నారు. ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్‌ను కచ్చితంగా నిషేధించాలని, ఇందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బృందాలు నగరంలో విస్తృతంగా పర్యటించాలని అధికారులను ఆదేశించారు.

కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్ రోడ్లో పర్యటించి అక్కడ ప్రహరి సరిగా లేకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు ఆ గోడను పునర్నిర్మించాలని, స్థానికంగా ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను అక్కడి నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు. విశాలాంధ్ర రోడ్డులో పర్యటించి నగర సుందరీకరణ లో భాగంగా డివైడర్లలో గ్రీనరీని పెంచాలని, రంగులు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏఈఆర్వోలు, పర్యవేక్షణ ఇంజినీర్ ప్రాజెక్ట్ పి.సత్యకుమారి, సెంట్రల్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రెడ్డిగూడెం మండలం రంగాపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద విజయవాడ ఎంజే నాయుడు హాస్పిటల్ సౌజన్యంతో కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఎముకలు, కీళ్లు, మోకాళ్లు, మెడ నొప్పులు, నడుము నొప్పి, కండరాల నొప్పులు, నరాలు, అరికాళ్ల తిమ్మిర్లు, మంటలు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

నాలుగో వార్డులో పీ4 లబ్ధిదారుల ధ్రువీకరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులో పీ4పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ పేదరికాన్ని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు, బంగారు కుటుంబాలు–మార్గదర్శకుల గురించి వివరించారు. పీ 4 లిస్టును ప్రదర్శించి లిస్టులో ఉన్న వారి పేర్లు ధ్రువీకరించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అమ్మాజీ, పులి అరుణ కుమారి, అనుమోలు కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలుంటేనే ఉపాధి

డీబీఎస్ బ్యాంకు ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్

తిరువూరు: ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు సాధిస్తేనే ఉపాధి లభిస్తుందని డీబీఎస్ బ్యాంకు సీనియర్ ఉపాధ్యక్షుడు దివ్వెల ఉదయ్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీ వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాలుగో ఏడాది బీటెక్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విజ్ఞానంలో కీలకమైన హ్యూమన్ 2.0, బియాండ్ జెన్ ఏఐ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేవలం డిగ్రీ సర్టిఫికెట్‌తో ఉద్యోగాలు పొందవచ్చనే ఆలోచన మానుకుని నైపుణ్య శిక్షణలో నిష్ణాతులు కావాలని ఉదయ్‌కుమార్ సూచించారు. కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్ర బాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కిశోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న కార్పొరేట్ క్విట్ ఇండియా డే

నూజివీడు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)ను వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా డే ఆగస్టు 13న నిర్వహిస్తామని అఖిల భారత కిసాన్ మహాసభ జాతీయ కార్యదర్శి డి.హరినాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఢిల్లీలో సమావేశమైన సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు నిరసన తెలుపుతామని పేర్కొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

జి.కొండూరు: మండల పరిధి మునగపాడు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి గురువారం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకోగా కొందరు పారిపోయారు. పట్టుబడిన వారి నుంచి రూ.2,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

మధ్యంతర భృతి చెల్లించాలి: పీఆర్‌టీయూ



విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

మైలవరం: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ ఏర్పాటుచేసి మధ్యంతర భృతి చెల్లించాలని పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో పీఆర్‌టీయూ మైలవరం మండల అధ్యక్షుడు చెన్నోజు సతీష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, యాప్‌ల భారం తగ్గించాలన్నారు. సీనియర్ నాయకులు జడ్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల పదవీ విరమణ చేసిన పి.గోపాల్, మట్లా వెంకటేష్, నాగేశ్వరరావు, రవీంద్ర, సుప్రీకుమారి, శ్రీదేవి, పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.గోపాల్‌ను సన్మానించారు.

నూజివీడు డిపో పరిశీలన


గ్యారేజీలో బస్సుల పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీపీటీఓ షేక్ షబ్నం

నూజివీడు: స్థానిక ఆర్టీసీ డిపోను ఏలూరు డీపీటీఓ షేక్ షబ్నం శుక్రవారం పరిశీలించారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత, పబ్లిక్ టాయ్‌లెట్స్, వాటర్ సప్లయ్, ట్రాఫిక్ సెక్షన్ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సర్వీసు రానున్న నేపథ్యంలో గ్యారేజీలోని బస్సులను తనిఖీ చేశారు. బస్సులు ప్రయాణించేటప్పుడు ఎక్కడా ఆగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆమె వెంట డిపో ఇన్‌చార్జి మేనేజర్ జి.రాంబాబు ఉన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ–2

ముసునూరు: విద్యార్థులు మంచి నడవడికతో చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఈఓ–2 బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతూ సర్వతోముఖాభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి పిల్లలతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట హెచ్ఎం శైలజ ఉన్నారు.

వర్షాలతో పత్తి రైతుల ఆందోళన


పత్తి పొలంలో నిలిచిన వర్షం నీరు

పెనుగంచిప్రోలు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్టపంటలకు చేటుగా మారాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాలకు పొలాలు మొత్తగా నాని వర్షపు నీరు నిల్వ ఉంటుండటం పత్తిసాగు నష్టమని రైతులు చెబుతున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో కలిపి ఇప్పటివరకు 15 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, మరో 2 వేల నుంచి 3 వేల ఎకరాల్లో పత్తిసాగు చేపట్టే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వర్షాలకు పత్తి పంట నీటమునిగి మొక్కలు కుళ్లిపోతాయి. అధిక తేమ కారణంగా పంట ముడుచుకుపోతుంది. పత్తి ఆకులు ఎర్రబడి చెట్టు మొత్తం ఎర్రగా మారి ఎండిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..

సస్యరక్షణ చర్యల్లో భాగంగా రైతులు వర్షం తగ్గిన వెంటనే పత్తిపంట ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి.సూక్ష్మ పోషక లోప నివారణకు ఫార్ములా–4 పొటా షియం నైట్రేట్ వంటి సూక్ష్మ పోషకాలు కలిగిన ఎరువులను పైపాటుగా పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మిరపనారు మడుల్లో తెగులు గమనించినట్లయితే లీటర్ నీటికి రెండున్నర గ్రాముల బ్లైటాక్స్ కలిపి పిచికారీ చేసుకోవాలని, వర్షం తగ్గిన వెంటనే ఐదు సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ చల్లుకుంటే సరిపోతుందని వ్యవసాయాధికారులు వివరించారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: తిరువూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతిలో, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 28వ తేదీలోగా నేరుగావచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రవేశ పరీక్ష రాసిన వారు, రాయని వారు కూడా మరలా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

రహదారిలో జంగిల్ క్లియరెన్స్

ముసునూరు: ఎట్టకేలకు చెక్కపల్లి–చింతలవల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. చెక్కపల్లి–చింతలవల్లి ఆర్అండ్‌బీ రహదారిని మూసివేస్తూ ఇరువైపులా పెరిగిన ముళ్ల కంపను తొలగించాలని పలువురు స్థానికులు ఎప్పటి నుంచో అధికారులకు కోరుతున్నారు. దీంతో మూడు కిలో మీటర్ల పొడవునా రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల కంచెలను తొలగించారు.